క్లుప్తంగా...

గృహ కార్మికులకు పీఎఫ్, ఈఎస్‌ఐ వర్తింపజేయాలి

రామంతాపూర్: ఇళ్లలో పని చేసే కార్మికులకు ఈఎస్‌ఐ, పీఎఫ్ సదుపాయాలు కల్పించాలని పలువురు నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు మౌంట్ ఫోర్డు సోషల్ ఇనిస్టిట్యూట్, రాష్ట్ర గృహ కార్మికుల యూనియన్ ఆధ్వర్యంలో శనివారం ఇళ్లలో పని చేసే మహిళలు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ వర్గీస్ టేక్ నాథ్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఉన్న గృహ కార్మికులైన మహిళలకు ఈఎస్‌ఐ, పీఎఫ్ ఇతర సౌకర్యాలు వర్తింపజేయాలని కోరుతూ త్వరలో దేశ వ్యాప్తంగా ఆందోళన చేపడతామన్నారు. అనంతరం ఇళ్లల్లో పని చేస్తున్న మహిళలు ఈఎస్‌ఐ పీఎఫ్ వర్తింపజేయాలని కోరుతూ, ప్రధాన మంత్రి, రాష్ట్ర ముఖ్యమంత్రికి ఉత్తరాలు రాసి పోస్ట్ చేశారు. కార్యక్రమంలో అలంగర్, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

అశ్రు నయనాలతో మనోజ్ సాయి అంత్యక్రియలు


మనోజ్ సాయి (ఫైల్)

ఉప్పల్: టీఆర్ఎస్ సీనియర్ నాయకుడు అంబటి జగదీష్ ముదిరాజ్ కుమారుడు అంబటి మనోజ్ సాయి(23) శుక్రవారం రాత్రి గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందాడు. అందరితో కలివిడిగా ఉండే సాయి ఆకస్మిక మృతితో చిలుకానగర్, న్యూరాంనగర్‌లో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. సాయి మృతదేహాన్ని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి, మాజీ మంత్రి ఈటల రాజేందర్, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్, కాంగ్రెస్ నాయకుడు రాగిడి లక్ష్మారెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బండారి లక్ష్మారెడ్డి, నెర్ధం భాస్కర్ సందర్శించి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం చిలుకానగర్‌లో హిందూ స్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

సైంటిఫిక్‌గా నీటి కాలుష్యానికి చెక్



ఉప్పల్: ఉప్పల్ సర్కిల్ పరిధిలో మొదటి సారిగా మంచి నీటి కాలుష్యానికి యంత్రం సాయంతో చెక్‌పెట్టారు. నేరుగా నేరు కలుషితమవుతున్న ప్రాంతాన్ని గుర్తించేందుకు నీటి పైప్‌లైన్‌కు రధ్రం చేస్తారు. దాని ద్వారా పైప్‌ను లోపలికి పంపీ కంప్యూటర్ సహాయంతో ఇచ్చితమైన ప్రాంతాన్ని గుర్తిస్తారు. శనివారం రాఘవేంద్ర కాలనీలో ప్రయోగాత్మకంగా ఈ ప్రక్రియను చేపట్టిన జల మండలి అధికారులు నీటి కాలుష్యాన్ని అరికట్టగలిగారు. ఈ సందర్భంగా ఏఈ సత్యనారాయణ మాట్లాడుతూ ఉప్పల్ లో మొట్టమొదటి సారిగా ఈ యంత్రాన్ని వినియోగించినట్లు తెలిపారు. దీంతో కలుషితమయ్యే ప్రాంతాన్ని గుర్తించి మరమ్మతులు చేపట్టామన్నారు. గతంలో నీటి కాలుష్యాన్ని గుర్తించేందుకు పైప్‌లైన్‌ను పూర్తిగా తవ్వాల్సి వచ్చేదని తెలిపారు. ఇకపై కాలుష్య సమస్య రాకుండా, వచ్చినా వెంటనే అరికట్టే సామర్థ్యం ఈ యంత్రానికి ఉందని తెలిపారు.

ఘనంగా 'మోకు దెబ్బ' వార్షికోత్సవం



ఉప్పల్: ఉప్పల్ విజయపురి కాలనీలో శనివారం సర్వాయి పాపన్న మోకు దెబ్బ గౌడ సంఘం 6 వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. మోకు దెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్సం సోమన్న గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి రాష్ట్ర తాడి కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవికుమార్ గౌడ్, అధ్యక్షుడు జక్క వీర స్వామి గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు సర్వాయి పాపన్న జెండాను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలో గౌడ కులస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించామన్నారు. కల్లును నీరాగా అభివృద్ధి పరిచినట్లు తెలిపారు. కార్యక్రమంలో విశిష్ట అతిథులుగా ఏబీసీసీ రాష్ట్ర నాయకులు కత్తి వెంకటస్వామి గౌడ్, పంజాల జైహింద్ గౌడ్ పాల్గొన్నారు.

బోనాల జాతరకు ఆలయాల ముస్తాబు

నేడు, రేపు మల్కాజిగిరి ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఆలయంలో బోనాల ఉత్సవాలు

- సోమవారం రంగం
- మద్యం దుకాణాల బంద్, ట్రాఫిక్ మళ్లింపు


ఉజ్జయిని మహంకాళి అమ్మవారి దేవాలయం


బోనాల నిధుల చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి

మల్కాజిగిరి: మల్కాజిగిరి డివిజన్ పరిధిలో ఆది, సోమవారాల్లో జరిగే బోనాల పండుగ జాతరకు దేవాలయాలు ముస్తాబయ్యాయి. మల్కాజిగిరిలోని ఉజ్జయిని మహంకాళి అమ్మవారి దేవాలయం, బాల సరస్వతీ నగర్‌లోని నల్లపోచమ్మ దేవాలయం, ఆనంద్‌బాగ్‌లోని బందరు పోచమ్మ దేవాలయం, సఫిల్‌గూడలోని కట్ట మైసమ్మ దేవాలయం, నేరెడ్‌మెట్‌లోని మూడుగుళ్ల ప్రముఖ ఆలయాలుగా గుర్తింపు పొందాయి. మల్కాజిగిరి మహంకాళీ అమ్మవారి దేవాలయంలో ఆదివారం బోనాలు సమర్పిస్తారు. సోమవారం మధ్యాహ్నం రంగం (భవిష్యవాణి) కార్యక్రమం, పోతరాజు గావు పట్టుట, అనంతరం అమ్మవారిని సాగనంపే కార్యక్రమంతో జాతర ముగుస్తుంది. పలు ప్రాంతాల్లో నిర్వాహకులు ఫలహారం బండ్ల ఊరేగింపు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ మళ్లింపుతో పాటు వాహనాల పార్కింగ్ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. జలమండలి విభాగం అధికారులు ప్రధాన కూడళ్లలో భక్తుల కోసం మంచినీటి వసతి కల్పిస్తున్నారు.

మద్యం దుకాణాలు బంద్

రాచకొండ కమిషనర్ ఉత్తర్వుల మేరకు ఆదివారం ఉదయం 6 గంటల నుంచి సోమవారం ఉదయం 6 గంటల వరకు మద్యం దుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్‌లు, కల్లు దుకాణాలు మూసివేయాలని సీఐ రవికుమార్ తెలిపారు.

ట్రాఫిక్ మళ్లింపు

- 16వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటల నుంచి 17వ తేదీ రాత్రి 11 గంటల వరకు ట్రాఫిక్ మళ్లింపులు అమలులో ఉంటాయని సీఐ శివశంకర్ తెలిపారు.
- 16వ తేదీ ఉదయం 10 గంటల నుంచి సికింద్రాబాద్ నుంచి నేరెడ్‌మెట్ వైపు వచ్చే వాహనాలు ఆనంద్‌బాగ్-ఏఓసీ-ఆర్‌కె పురం మీదుగా వెళ్లాలి
- నేరెడ్‌మెట్ నుంచి సికింద్రాబాద్ వెళ్లే వాహనాలు ఆర్‌కెపురం-ఏఓసీ-ఆనంద్‌బాగ్ మీదుగా సికింద్రాబాద్‌కు చేరుకోవాలి
- 17 వ తేదీ మధ్యాహ్నం 2 గంటల నుంచి సికింద్రాబాద్ నుండి నేరెడ్‌మెట్ వెళ్లే వాహనాలు లాలాపేట్-జెడ్‌టీసీ- ఆనంద్‌బాగ్- వినాయకనగర్ మీదుగా నేరెడ్‌మెట్ లేదా జెడ్‌టీసీ- ఈసీఐఎల్ మీదుగా నేరెడ్‌మెట్ వరకు
- నేరెడ్‌మెట్ నుంచి సికింద్రాబాద్ వెళ్లే వాహనాలు ఆర్‌కెపురం-ఏఓసీ-ఆనంద్‌బాగ్ నుంచి సికింద్రాబాద్‌కు మళ్లించనున్నారు.

ఎమ్మెల్యే మైనంపల్లి శుభాకాంక్షలు

మల్కాజిగిరి నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే మైనంపల్లి బోనాల జాతర సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. శనివారం ఆయన క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని 141 దేవాలయాలకు ప్రభుత్వం నుంచి విడుదలైన జాతర నిధులకు సంబంధించి చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ప్రేమ్‌కుమార్, సునీతాయాదవ్, సబితాకిషోర్, రాజ్యలక్ష్మి, నాయకులు జగదీష్ గౌడ్, పరశురామిరెడ్డి, పిట్ల శ్రీనివాస్, జీఎన్వీ సతీష్ కుమార్, గుండా నిరంజన్, రాముయాదవ్, సత్యమూర్తి, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.


బోనాలకు ముస్తాబైన బద్ది పోచమ్మ దేవాలయం


విద్యుత్ దీపాల వెలుగులో మహంకాళి దేవాలయం

బోనాలకు సర్వం సిద్ధం

రామంతాపూర్: రామంతాపూర్ పరిధిలోని పలు బస్తీలు, కాలనీల్లోని అమ్మవార్ల ఆలయాల్లో ఆదివారం, (సోమవారం) నిర్వహించనున్న బోనాల వేడుకలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్‌రావు పర్యవేక్షణలో ఆయా ఆలయాల వద్ద రహదారులకు మరమ్మతులు చేయించారు.

ఆలయ పరిసరాల్లో పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. పాత రామంతాపూర్‌లోని పురాతన మహంకాళీ ఆలయం, నెహ్రూనగర్‌లోని బద్ది పోచమ్మ ఆలయం ప్రధాన రహదారిలో ఉన్న కట్ట మైసమ్మ, నల్ల పోచమ్మ ఆలయాలతో పాటు చిన్న చెరువు కట్ట కింద ఉన్న ఈదమ్మ, గోకులనగర్‌లోని ఊర పోచమ్మ, రాంశంకర్ నగర్‌లోని రక్త మైసమ్మ అమ్మవార్ల ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

భక్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు



బోనాల పండుగ సందర్భంగా రామంతాపూర్ పరిధిలోని అన్ని ఆలయాల వద్ద రహదారులకు మరమ్మతులు చేయించాం. ఆలయ పరిసరాలను శుభ్రం చేయించాం. పండుగ జరిగే రెండు రోజులలు ప్రతి ఆలయం వద్ద శానిటరీ సిబ్బంది సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకున్నారు.

– బండారు శ్రీవాణి, కార్పొరేటర్, రామంతాపూర్

జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆకస్మిక తనిఖీ


ఉప్పల్‌లో పర్యటిస్తున్న జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్

ఉప్పల్: ఉప్పల్ సర్కిల్ పరిధిలో శనివారం జీహెచ్‌ఎంసీ కమిషనర్ డి. రోనాల్డ్ రాస్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ పంకజ, ఉప్పల్ డిసి అరుణకుమారి, వివిధ విభాగాల అధికారులతో కలిసి నాగోల్ సెకండరీ కలెక్షన్ ట్రాన్స్‌ఫర్ పాయింట్‌ను సందర్శించారు. అనంతరం చిలుకానగర్, ఉప్పల్ డివిజన్ల పరిధిలో చెత్త కుప్పలను గుర్తించిన ఆయన చెత్త పేరుకుపోవడానికి కారణాలు అడిగి తెలుసుకున్నారు. జీవీపీ పాయింట్ల ఎత్తివేతకు తీసుకోవాల్సిన చర్యలపై ఎస్‌ఎఫ్‌ఎలను అడిగి తెలుసుకున్నారు. స్వచ్ఛ సేవకులకు చెత్త ఇవ్వని వారిని గుర్తించి నేరుగా వారి ఇంటికి వెళ్లి కారణాలను అగిడి తెలుసుకున్నారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ ఆరు బయట, ఖాళీ ప్రదేశాల్లో, నాళాల్లో జీవీపీ పాయింట్ల వద్ద చెత్త వేయకూడదని, స్వచ్ఛ సేవకులకు మాత్రమే చెత్తను ఇవ్వాలని సూచించారు. స్వచ్ఛ సేవకులు, ఆటో డ్రైవర్ల హాజరు విషయంలో కఠినంగా ఉండాలని సూచించారు. అనంతర వివిధ సర్కిళ్ల డీసీల తో సమీక్ష సమావేశం నిర్వహించి సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ పై శ్రద్ధ పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఉప్పల్ సర్కిల్ ఈఈ నాగేందర్, డీఈ చందన, నీలిమ, సానిటరీ సూపర్ వైజర్లు సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


మహిళకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి

మల్కాజిగిరి: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం పనిచేస్తుందని మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి అన్నారు. శనివారం ఆయన క్యాంప్ కార్యాలయంలో బీసీ కార్పొరేషన్ నుంచి కులవృత్తిదారులకు మంజూరైన చెక్కులను 50 మంది లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వర్గాలకు న్యాయం చేయాలని ముఖ్యమంత్రి తపిస్తున్నారన్నారు. దళిత బంధు, మైనారిటీలకు రుణం, కుల వృత్తుల వారికి చేయూత పథకాలతో వారిని ఆర్థికంగా బలోపేతం చేస్తున్నారన్నారు. దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన బీసీ కుల వృత్తుల వారికి రూ. లక్ష అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ప్రేమ్‌కుమార్, మేకల సునీతాయాదవ్,సబితాకిషోర్, రాజ్యలక్ష్మి, నాయకులు జగదీష్‌గౌడ్, పరశురామిరెడ్డి, పిట్ల శ్రీనివాస్, జీఎన్వీ సతీష్‌కుమార్, గుండా నిరంజన్, రాముయాదవ్, సత్యమూర్తి, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

మౌలాలి: వినాయక్‌నగర్ డివిజన్ వినాయక్‌నగర్, కాకతీయనగర్, సాయినగర్‌లో సుమారు రూ. కోటి వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను శనివారం ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, స్థానిక కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మీతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మల్కాజిగిరి నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నామన్నారు. నియోజకవర్గంలో డ్రైనేజీ, సీసీ రోడ్ల సమస్యను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ప్రేమ్‌కుమార్, మీనా ఉపేందర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ జగదీష్‌గౌడ్, ఈఈ లక్ష్మణ్, డీఈ లౌక్య, ఏఈ దీపక్, నాయకులు పరుశురాంరెడ్డి, పిట్ల శ్రీనివాస్, జీఎన్‌వీ.సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నల్లపోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు


పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి

కుషాయిగూడ: బోనాల ఉత్సవాలను పురస్కరించుకుని హెచ్‌బీకాలనీ, సబ్‌స్టేషన్‌లోని నల్ల పోచమ్మ ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన హోమం, అన్నదాన పూజా కార్యక్రమాల్లో ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, మాజీ మేయర్ బొంతు రాంమోహన్, కార్పొరేటర్ ప్రభుదాస్, బీఆర్ఎస్ సీనియర్ నేత బండారి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగ ఆలయ కమిటీ ప్రతినిధులను వారిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యుడు ముత్యం వెంకన్న, జనుంపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎమ్మెల్యే పాదయాత్ర

ఉప్పల్: ఉప్పల్ డివిజన్‌లో 11 వ రోజు ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి పాదయాత్ర కొనసాగింది.అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ సమస్యలు తెలుసుకుంటూ ముందుకు సాగారు. డివిజన్ పరిధిలోని హనుమాన్ దేవాలయం, కుమ్మరి బస్తీ,చాకలి బస్తీ, న్యూ భరత్‌నగర్,, శ్రీరామా కాలని, ఉప్పల్ ముదిరాజ్ భవన్ తదితర ప్రాంతాల్లో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు.

గాంధీనగర్ బ్రిడ్జి నిర్మాణంపై ఉన్నతాధికారుల విచారణ

సాక్షి ఎఫెక్ట్..

కుషాయిగూడ: చర్లపల్లి డివిజన్, గాంధీనగర్ కాలనీలో నిర్మిస్తున్న కల్వర్టు నిర్మాణంలో అవకతవకలపై 'సాక్షి'లో ప్రచురితమైన కథనంపై స్పందించిన ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. కాంట్రాక్టర్ పాత కట్టడంపైనే కల్వర్టు నిర్మాణం చేపడుతున్న తీరుపై కథనాలు రావడంతో స్పందించిన ఉన్నతాధికారులు ఇంజినీరింగ్ అధికారులను వివరణ ఇవ్వాలని కోరారు. కల్వర్టు నిర్మాణానికి ముందు సాధారణ నాణ్యత పరీక్షలు చేసి నిర్మాణం చేపట్టినట్లు సంబంధిత ఏఈ అధికారులకు వివరణ ఇచ్చారు. అయితే దీనిపై సంతృప్తి చెందని అధికారులు తిరిగి నాణ్యత పరీక్షలు చేయించాలని ఆదేశించడంతో తాజాగా పూర్తిస్థాయిలో నాణ్యత పరీక్షలు నిర్వహించి ఉన్నతాధికారులకు నివేదిక అందజేశారు. రిపోర్టును పరిశీలించిన అధికారులు షరతులు విధిస్తూ కల్వర్టు నిర్మాణానికి అనుమతినిచ్చినట్లు ఏఈ స్వరూప శనివారం తెలిపారు. గతంలో చేపట్టిన నిర్మాణం కాకుండా కొత్తగా చేసే నిర్మాణానికి మాత్రమే ఎంబీ రికార్డు చేయాలని అధికారులు సూచించినట్లు ఆమె పేర్కొన్నారు. రూ. 60 లక్షలతో చేపట్టాల్సిన కల్వర్టు నిర్మాణ వ్యయం తగ్గే అవకాశం ఉందన్నారు. ప్రజాధనం దుర్వినియోగం కాకుండా కాపాడిన 'సాక్షి'ని స్థానికులు అభినందించారు.

బోనాల చెక్కుల పంపిణీ

గౌతంనగర్: బోనాల వేడుకలు భక్తి శ్రద్ధలతో ప్రశాంతంగా జరుపుకోవాలని గౌతంనగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత యాదవ్ అన్నారు. శనివారం రాష్ట్ర ప్రభుత్వం బోనాల పండుగకు ఆలయ నిర్వాహకులకు మంజూరు చేసిన చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, ఆలయ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించాలి


గౌరవ వందనం స్వీకరిస్తున్న స్టీఫెన్ రవీంద్ర

రామంతాపూర్ : విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించి భవిష్యత్తులో క్రమశిక్షణ గల నాయకులుగా రూపుదిద్దుకునేందుకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కృషి చేయాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర అన్నారు. శనివారం రామంతాపూర్ హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించిన విద్యార్థి నాయకుల నియామకోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థి దశలోనే చిన్నారుల్లో జాతీయ భావం, క్రమశిక్షణ, మానవీయ విలువలు తదితర అంశాలను బోధించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. రాంకీ ఎన్విరాన్‌మెంట్ ఇంజనీరింగ్ సంస్థ అధిపతి గౌతమ్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో పోటీతత్వం అలవరచుకోవాలని, దేశానికి ఉపయోగపడే క్రమశిక్షణ గల పౌరులుగా తయారు కావాలని సూచించారు. అనంతరం విద్యార్థి నాయకులు మహ్మద్ ఉమేద్, ఇక్బాల్ కాలేద్, అలేఖ్య కుందు నాయకత్వంలో పాఠశాలకు చెందిన ఎన్‌సీసీ, త్రివిధ దళాల విద్యార్థులు కవాతు నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌పీఎస్ సొసైటీ అధ్యక్షుడు గుస్తీ నోరియా, శ్యామ్ మోహన్, ఉపేందర్‌బాబు, మర్రి ఆదిత్యరెడ్డి, జలగం వెంకట్రావ్, స్కందబలి, స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ సల్లారం నరసింహారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక ధృఢత్వం


ఫుట్‌బాల్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న బండారి లక్ష్మారెడ్డి

మల్లాపూర్: క్రీడలు శారీరక ధృఢత్వానికి దోహదపడతాయని బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, రాష్ట్ర బీఆర్ఎస్ నాయకులు బండారి లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం మల్లాపూర్ హెచ్‌బీ పెట్రోల్ బంక్ వద్ద బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బీఎల్ఆర్ ఫుట్‌బాల్ టోర్న మెంట్‌ను ప్రారంభించారు, ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ యువత క్రీడల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో బీఎల్ఆర్ ట్రస్ట్ ప్రతినిధులు కటార్ల భాస్కర్, శ్రీశైలం యాదవ్, బోదాసు నరేష్, అక్బర్, యాది,సురేష్. నిర్వాహకులు షరిక్, షరీఫ్.అబ్దుల్ తదితరులు పాల్గొన్నారు.

నల్ల పోచమ్మ దేవాలయానికి విరాళం


విరాళం అందజేస్తున్న వెంకటేశ్వర్లు

మల్లాపూర్: అశోక్‌నగర్‌కు చెందిన పాలెం జానకి, మోహన్‌రెడ్డి దంపతులు కేబుల్ చౌరస్తాలోని నల్ల పోచమ్మ దేవాలయం ఐరన్ గ్రిల్ గేట్ ఏర్పాటుకు శనివారం రూ.30 వేలు దేవాలయం కమిటీ సభ్యులకు అందజేశారు.

నెహ్రూనగర్‌లో...

నెహ్రూనగర్ బోనాల పండుగ సందర్భంగా రేణుక ఎల్లమ్మ, పోచమ్మ దేవాలయం, మైసమ్మ, పోచమ్మ, ధనలక్ష్మీ దేవాలయల పూజా ఖర్చులకు మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి ఎడ్ల వెంకటేశ్వర్లు విరాళం అందజేశారు.

ఘనంగా గోరింటాకు మహోత్సవం

కాప్రా: మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో శనివారం కాప్రా పద్మశాలి భవన్‌లో ఆషాఢమాస గోరింటాకు మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా రాజస్థానీ ట్రూప్ ఆధ్వర్యంలో తయారు చేసిన గోరింటాకు మహిళలను ఆకట్టుకోంది. మహిళల బతుకమ్మ ఆట, పాటలు, నృత్యాలతో సందడి చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన అఖిలభారత పద్మశాలి సంఘం మహిళా అధ్యక్షురాలు వనం దుశ్యంతల, ప్రధాన కార్యదర్శి చిలువేరు సునీత మాట్లాడుతూ.. అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తున్నామన్నారు. మహిళా శక్తి లేనిదే సమాజం ముందుకు సాగదన్నారు. గోరింటాకు మహోత్సవానికి పెద్ద ఎత్తున మహిళలు హాజరుకావడం మహిళా శక్తికి నిదర్శనమన్నారు. రాష్ట్ర అధ్యక్షులు మచ్చ ప్రభాకర్, రాష్ట్ర కార్యదర్శి శంకర్ మాట్లాడుతూ.. పద్మశాలీలు ఎదుర్కొంటు సమస్యలు పరిష్కారానికి నోచుకోవడంలేదన్నారు. పద్మశాలీలు సంఘటితమై రాజకీయాల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కందగట్ల స్వామి, చిట్టిమిల్ల గణేష్, రాగజ్యోతి, బొమ్మ అమరేందర్, శోభ, అరుణ, సంధ్య, లక్ష్మి, బొమ్మ ప్రవలిక, విజయలక్ష్మి, రమ్యకృష్ణ తదితరులు పాల్గొన్నారు.